క్లుప్తంగా

ఫెర్రీ రోడ్డులో ఆక్రమణల తొలగింపు



ఇబ్రహీంపట్నం: మున్సిపాలిటీ కమిషనర్ శంకర్‌నాయక్ సోమవారం ఫెర్రీ రోడ్డులో ఆక్రమణలు తొలగించే పనులకు ఉపక్రమించారు. ఇటీవల కొండపల్లిలో డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగింపజేసిన ఆయన ఇప్పుడు ఇబ్రహీంపట్నంపై దృష్టి సారించారు. ఫెర్రీ రోడ్డు 2016 కృష్ణా పుష్కరాల సమయంలో డబుల్ రోడ్డుగా ఏర్పడింది. రోడ్డుపక్క షాపుల యజమానులు మున్సిపాలిటీ స్థలాన్ని సైతం రోజువారీ అద్దెకు ఇవ్వడంతో భారీగా ఆక్రమణలు పెరిగి రోడ్డు కుచించుకుపోయింది. దీంతో రాకపోకలకు ఆటంకంగా మారింది. మున్సిపాలిటీ చేపట్టిన ఆక్రమణల తొలగింపుతో విశాలమైన రోడ్డు ఏర్పాటు కానుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ వెంచర్‌లు అరికట్టాలని ఫిర్యాదు



మైలవరం: మైలవరం మండల పరిధిలో ఏర్పాటు చేస్తున్న అక్రమ వెంచర్లను అరికట్టాలని గ్రామానికి చెందిన బోడా మల్లికార్జునరావు సోమవారం స్పందన కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌కు అర్జీని అందజేశారు. మైలవరం మండల పరిషత్ కార్యాలయం సమావేశ హాలులో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బోడా మల్లికార్జునరావు మాట్లాడుతూ అక్రమ వెంచర్ల ద్వారా నిర్వాహకులు ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండికొడుతున్నారని, ప్రభుత్వానికి కట్టవలసిన నాలా, చలానాలు కట్టకుండా, వెంచర్ల ద్వారా ప్రభుత్వానికి కేటాయించాల్సిన పది శాతం భూమిని ఇవ్వకుండా ప్రభుత్వాన్ని, ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. అక్రమ వెంచర్‌లు వేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా తమ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఉచితంగా ఈ-ఫైలింగ్ సేవలు



ఆగిరిపల్లి: డీపీఆర్‌టీయూ అందిస్తున్న ఈ-ఫైలింగ్ ఉచిత సేవలను ఉపాధ్యాయులు ఉపయోగించుకోవాలని ఆ సంఘ మండల కార్యదర్శి వంశీ కోరారు. ఆగిరిపల్లిలో డీపీఆర్‌టీయూ ఈ-ఫైలింగ్ ఉచిత సేవలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ అవకాశాన్ని మండలంలోని ఉపాధ్యాయులందరూ వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు నాగరాజు, గౌరవ అధ్యక్షురాలు లక్ష్మి, ఆర్థిక కార్యదర్శి రవికుమార్, అసోసియేట్ అధ్యక్షుడు యాలాద్రి, మహిళా కార్యదర్శి సుహాసిని పాల్గొన్నారు

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ



చాట్రాయి: డెంగీ నివారణపై అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ వైద్యుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని చాట్రాయి గ్రామంలో సోమవారం డెంగీ నివారణ మాసోత్సవ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరసరాల పరిశుభ్రత పాటించాలని, నీటి నిల్వలను, పాడైన టైర్లు, కొబ్బరి డొక్కలను తొలగించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఆహార నియమాలు పాటించాలని, దోమతెరలను వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ పీవీ శ్రీధర్, వైద్యులు ఎం.జ్యోతి, సీహెచ్‌ఓ రమణ, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

21న గురుపౌర్ణమి సందర్భంగా భగవద్గీత ప్రచారం

రెడ్డిగూడెం: ఈనెల 21వ తేదీన ఆషాఢమాసంలో వచ్చే గురు పౌర్ణమిని పురస్కరించుకుని రెడ్డిగూడెం మండలంలోని మద్దులపర్వ గ్రామంలో త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా కమిటీ సభ్యులు కె.రమాదేవి, భానుప్రకాష్, వెంకటేశ్వరరావు, శ్రీకాంత్‌కుమార్, రామాంజనేయులు, వంశీకృష్ణ, గాయత్రి తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి ఎప్పుడు?

- 20 లక్షల ఉద్యోగాల వాగ్దానం ఫలించేనా?
- ఆశగా ఎదురు చూస్తున్న నిరుద్యోగులు
- నిబంధనలతో పథకాన్ని నీరుగారుస్తారేమోనని ఆందోళన
- నియోజకవర్గంలో 72.729 కుటుంబాలు



జి.కొండూరు: ఉద్యోగం... లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తామంటూ ఎన్డీయే కూటమి ఎన్నికల ముందు ప్రచారంలో ఊదరగొట్టింది. కూటమి చేసిన ప్రచారం కార్యరూరం దాల్చేదెప్పుడా అని నిరుద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఎన్డీయే కూటమిలో ప్రధాన పార్టీ అయిన తెలుగుదేశం పార్టీ గతంలో ఇటువంటి మోసపూరిత హామీలను ఇచ్చి అటు ప్రజలతో పాటు ఇటు నిరుద్యోగులను సైతం మోసం చేసింది. ఈ ఏడాది ఎన్నికలలో కూటమి ఇచ్చిన హామీలలో ఉచిత ఇసుక, మెగా డీఎస్సీ అంటూ ఇప్పటికే దగా చేయడంతో నిరుద్యోగ భృతి హామీ కూడా అంతేనా అని నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఒక వేళ పథకం అమలు చేసినప్పటికీ లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేందుకు నిబంధనల పేరుతో కోతలు పెడతారేమోనని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే ఈ పథకం అమలు చేసి తమకు ఉద్యోగాలు కల్పించాలని లేదా నిరుద్యోగ భృతి అందించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

నియోజకవర్గంలో 72,729 కుటుంబాలు

మైలవరం నియోజకవర్గంలోని జి.కొండూరు మండల పరిధిలో నివాసం ఉంటున్న 15,105 కుటుంబాలు, మైలవరం మండల పరిధిలో 20,061 కుటుంబాలు, రెడ్డిగూడెం మండల పరిధిలో 13,812 కుటుంబాలు, ఇబ్రహీంపట్నం మండల పరిధిలో 12,338 కుటుంబాలు, విజయవాడ రూరల్ మండల పరిధిలో 11,413 కుటుంబాలు కూటమి ప్రభుత్వం అమలు చేయనున్న ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి పథకం నుంచి లబ్ధి పొందేందుకు ఎదురు చూస్తున్నాయి.

నిరుద్యోగ భృతి హామీ నిలబెట్టుకోవాలి

తిరువూరు: ప్రభుత్వోద్యోగాల కోసం ప్రయత్నించే నిరుద్యోగ యువతకు తెలుగుదేశం పార్టీ ఎన్నికల హామీల్లో ప్రకటించిన నిరుద్యోగ భృతిని వెంటనే మంజూరు చేయాలని తిరువూరు నియోజకవర్గ యువత కోరుతున్నారు. తిరువూరు డివిజన్లో సుమారు 15వేల మంది నిరుద్యోగ యువత ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులు అధికంగా ఉన్న తిరువూరు డివిజన్లో ప్రైవేటు పరిశ్రమలు, ఇతర ఉపాధి కేంద్రాలు లేక పట్టభద్రులై ఉండి కూడా వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు.

చాలీచాలని వేతనాలతో వెతలు

తిరువూరు రెవెన్యూ డివిజన్లోని పలు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో బీఈడీ, ఎంఈడీ, టీటీసీ చదివిన నిరుద్యోగ యువత చాలీచాలనీ వేతనాలతో కాలం గడుపుతున్నారు. సకాలంలో డీఎస్సీ నోటిఫికేషన్లు రాక వయోపరిమితి దాటిపోయి ఏ ఉద్యోగానికీ అర్హత లేకుండా పోయిన పట్టభద్రులు నెలకు రూ.5వేల నుంచి రూ.7వేలకు ఉపాధ్యాయులుగా, అధ్యాపకులుగా ప్రైవేటు విద్యాసంస్థల్లో వెట్టిచాకిరీ చేస్తున్నారు. కుటుంబం గడవక, వేరొక ఉపాధి మార్గం కానరాక నరకం అనుభవిస్తున్న నిరుద్యోగ యువతకు గత ఎన్నికల్లో టీడీపీ ప్రకటించిన నిరుద్యోగ భృతి కొంతమేర ఆసరాగా నిలుస్తుందని ఆశిస్తున్నారు. డివిజన్‌లోని ఐదు మండలాల్లో 3వేలకు పైగా బీఈడీ పట్టభద్రులు, 4వేల మంది సాధారణ డిగ్రీ, బీటెక్ చదివినవారు ఉద్యోగాలు లేక ఖాళీగా ఉన్నారు. తమకు నిరుద్యోగ భృతిని త్వరితగతిన మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలి

నూజివీడు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై నెలరోజులు గడిచినప్పటికీ నిరుద్యోగభృతిపై ప్రభుత్వం నోరు మెదపకపోవడంపై నిరుద్యోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చేవరకు ప్రభుత్వమే బాధ్యత తీసుకుంటుందని, అప్పటివరకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతిని అందజేస్తామని కూటమి నాయకులు ఊదరగొట్టారు. ప్రభుత్వ అధినేత దీనిపై నోరు మెదపకపోవడంతో 2014లో చేసినట్లే చేస్తారా అనే సందేహాన్ని నిరుద్యోగులు వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు 71 వేల కుటుంబాలు ఉన్నాయి. ఈ కుటుంబాల్లో అర్హులైన నిరుద్యోగులందరూ ప్రభుత్వం తమకు నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారోనని ఎదురు చూస్తున్నారు.

ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నా



నేను 2015లో బీఎస్సీ పూర్తి చేశాను. ఆర్థిక సమస్యల వలన పై చదువులు చదవలేదు. చంద్రబాబు ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి అని ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారని ఆశిస్తున్నాను.

-యన్నం దినేష్‌రెడ్డి, మునగపాడు, జి.కొండూరు మండలం

నిరుద్యోగ భృతి కోసం...



డిగ్రీ వరకు చదువుకున్న నేను ఉద్యోగం కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. వివాహం అయి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పోషణ భారంగా మారింది. బతుకుతెరువు కోసం ఆటో తోలుకుంటున్నా. కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇస్తామని ప్రకటించింది. ఆశగా ఎదురు చూస్తున్నా.

-బాణావత్ దుర్గానాయక్, జూపూడి, ఇబ్రహీంపట్నం

ఎదురు చూస్తున్నా..



ముఖ్యమంత్రి చంద్రబాబు తాను అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తానని, లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తానని వాగ్దానం చేశారు. నేను డిగ్రీ వరకు చదివాను. పలు ఉద్యోగాలకు ప్రయత్నించాను. కానీ ఫలితం లేకుండా పోయింది. ముఖ్యమంత్రి వాగ్దానంతో ఉద్యోగం వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నా.

-కె.బాబు, మైలవరం

ఎన్నికల వాగ్దానం అమలు చేయాలి



చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో నిరుద్యోగ భృతి ఇస్తానన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తాననడంతో నిరుద్యోగులందరం ఆయనపై గంపెడాశలు పెట్టుకున్నాం. ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగులకు వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వాలి. ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి.

-పచ్చిగోళ్ల అజయ్, ఆగిరిపల్లి

భృతి కోసం ఎదురు చూస్తున్నాం



చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలి. ఈలోగా నిరుద్యోగ భృతి ఇవ్వాలి. భృతి ఇస్తే కనీసం కోచింగ్ తీసుకోవడానికైనా ఉపయోగపడతాయి. ఎన్నికల హామీని నిలబెట్టుకొని నిరుద్యోగులకు భరోసా కల్పించాలి.

-గరిసేపల్లి లక్ష్మీనారాయణ, ఆగిరిపల్లి

నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలి



తల్లిదండ్రులు ఇద్దరూ కూలిపనులకు వెళ్తారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చదివి ఉద్యోగం లేక ఖాళీగా ఉంటున్నా. చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీని జాప్యం చేయకుండా అమలు చేయాలి. నిరుద్యోగులకు ఒక్కొక్కరికీ నెలకు రూ.3000 చొప్పున ఇవ్వాలి.

-విస్సంపల్లి నితిన్, సి.గుడిపాడు, చాట్రాయి

అర్హతలకు అతీతంగా భృతి ఇవ్వాలి



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ యువతకు విద్యార్హతలతో సంబంధం లేకుండా ప్రతి నెలా భృతి మంజూరు చేయాలి. 20 లక్షల ఉద్యోగాలు లేదా నిరుద్యోగ భృతి హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం యువతను ఆదుకోవాలి.

- చెరుకు మోహన్‌కృష్ణ, తిరువూరు

నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇవ్వాలి



నిరుద్యోగ యువతకు ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం మేరకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి చెల్లించాలి. జీవనోపాధి లేక ఇబ్బందులు పడుతున్న నిరుద్యోగులకు ఈ భృతి కనీసం పోటీపరీక్షల పుస్తకాల కొనుగోలుకు ఉపయోగపడతాయని ఆశిస్తున్నాం.

- కంచెపోగు రాహుల్, తిరువూరు

మైలవరం ఎల్బీఆర్సీఈకి ఎస్ఐఆర్ఓ గుర్తింపు



ఎస్ఐఆర్ఓ గుర్తింపు పత్రంతో ఎల్బీఆర్సీఈ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, అధ్యాపకులు

మైలవరం: లకిరెడ్డి బాలిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మైలవరంలోని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధన విభాగం(డీఎస్ఐఆర్) సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ద్వారా సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ హోదా(ఎస్ఐఆర్ఓ) పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు తెలిపారు. స్థానిక కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ గుర్తింపు ఈ నెల 3 నుంచి 2027 మార్చి 31 వరకు అమలులో ఉంటుందన్నారు. ఈ గుర్తింపు ద్వారా కస్టమ్స్ లేదా ఎక్సైజ్ సుంకం చెల్లించకుండా రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ పరికరాలు, సాధనాలు, విడి భాగాలు, వినియోగ వస్తువులను దిగుమతి చేసుకోవచ్చని తెలిపారు. తమ కళాశాల డీఎస్‌టీ, డీబీటీ, ఐసీఎంఆర్, ఐసీఏఆర్ వంటి వివిధ ప్రభుత్వ శాఖలు, ఏజెన్సీల నుంచి ఆర్ అండ్ డీ నిధులను పొందవచ్చని, వారు పారిశ్రామిక పరిశోధనలు, అభివృద్ధి యూనిట్లకు సాంకేతిక, ఆర్థిక సహాయాన్ని కూడా అందించగలరని, నూతన ఆవిష్కరణలు సహకారం, సాంకేతిక బదిలీని ప్రోత్సహించడానికి ఎస్ఐఆర్ఓలు పరిశోధన సంస్థలు, వర్సిటీలు, ఇతర సంస్థలతో కలిసి పనిచేయవచ్చని తెలిపారు. ఇందుకు కృషి చేసిన ఆర్ అండ్ డీ డీన్ డాక్టర్ ఎస్.పిచ్చిరెడ్డి, ఎస్ఐఆర్ఓ ఇన్‌చార్జి డాక్టర్ టి.సత్యనారాయణ బృందాన్ని కళాశాల హానరరీ చైర్మన్ లకిరెడ్డి జయప్రకాష్‌రెడ్డి, చైర్మన్ లకిరెడ్డి ప్రసాదరెడ్డి, ప్రెసిడెంట్ జి.శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపాల్ అప్పారావు అభినందించారు.

సాగు హక్కు పత్రాలపై అవగాహన



చాట్రాయి: సాగు హక్కు పత్రాలపై కౌలు రైతులు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ మహ్మద్ మసూద్ ఆలీ అన్నారు. మండలంలోని చనుబండ, నరసింహారావుపాలెం గ్రామాల్లో సోమవారం కౌలు రైతులకు సాగు హక్కు పత్రాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కౌలు చేయదలచిన రైతులు భూ యజమాని వద్ద నుంచి అంగీకార పత్రం తీసుకుంటే సాగు హక్కు పత్రం ఇస్తామని, దీని ద్వారా ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్ట పరిహారం వస్తుందని, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందుతాయని తెలిపారు. అనంతరం కౌలు రైతులకు సాగు హక్కు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బి.శివశంకర్, టీడీపీ నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, పుచ్చకాయల నోబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

నూజివీడు ఆర్డీఓ భవానీశంకరి



మీకోసం కార్యక్రమంలో అర్జీ తీసుకుంటున్న ఆర్డీఓ భవానీశంకరి

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం)లో వచ్చే అర్జీలను గడువులోగా పరిష్కరించాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని నూజివీడు ఆర్డీఓ వై.భవానీశంకరి హెచ్చరించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఇచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేయాలన్నారు. సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో 7 అర్జీలు వచ్చాయని తెలిపారు. తన బంగారం, ఆస్తి రాయించుకుని తన మనవడు తనను చూడటం లేదని, నెలనెలా ఇచ్చే రూ.3 వేలు కూడా ఇవ్వడం లేదని, తనకు న్యాయం చేయాలని కోరుతూ చింతలపూడి మండలం సీతానగరానికి చెందిన కక్కిరాల సీతామహాలక్ష్మి(80) అనే వృద్ధురాలు అర్జీ అందజేశారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ సుందరి, డీఏ లేడీఓ వెంకటరత్నం, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ భాస్కరరెడ్డి, సీడీపీఓ నూరాని, హెచ్‌ఓ ఆర్.హేమ తదితర అధికారులు పాల్గొన్నారు.

జీపీఎస్ జీఓను ఉపసంహరించాలి

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ



విస్సన్నపేటలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

విస్సన్నపేట: జీపీఎస్ చట్టాన్ని అమలు చేస్తూ ఇచ్చిన జీఓ 54 ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బీసీహెచ్‌వీ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మండలపరిధిలో సోమవారం యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 3,4,5 తరగతుల విలీనాన్ని వెనక్కి తీసుకుని ఆ విద్యార్థులను ప్రాథమిక పాఠశాలల్లోకి పంపాలని, 117 జీఓను రద్దు చేయాలని సూర్యనారాయణ కోరారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా పూర్వ గౌరవ అధ్యక్షుడు డి.శ్రీనివాసరెడ్డి, ఏలూరు జిల్లా కార్యదర్శి పి.వీరకోటి, మండల శాఖ గౌరవ అధ్యక్షుడు బీవీ రామారావు, అధ్యక్షురాలు కె.చైతన్య, జిల్లా కౌన్సిలర్ పి.రామకృష్ణారెడ్డి, మండల నాయకులు కె.రంగా, ఎ.మురళి, వి.వెంకటేశ్వరరావు, సీహెచ్ చంటిబాబు, డి రాంబాబు పాల్గొన్నారు.

సారె సమర్పించిన 43 భక్త బృందాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు సోమవారం 43 బృందాలు ఆషాఢ సారెను సమర్పించాయి. నూజివీడు దుర్గ బృందంకు చెందిన 35 మంది, గుంటూరు బాలాజీ సేవా బృందంకు చెందిన 50 మంది, సాయినంద భక్తి బృందంకు చెందిన 60 మంది, ఉండవల్లి సెంటర్‌కు చెందిన టి.శ్రీలక్ష్మి బృందంకు చెందిన 50 మంది, శ్రీమారుతీ లలితా మండలికి చెందిన 40 మంది, శ్రీరామ భక్త బృందంకు చెందిన 35 మంది, సింగ్‌నగర్‌కు చెందిన కె.మల్లికార్జునరావు బృందంకు చెందిన 45 మంది, రామకృష్ణ కోలాట సంఘంకు చెందిన మరో 30 మంది, గుడివాడకు చెందిన మురళీకృష్ణ కోలాట బృందంకు చెందిన 45 మందితో పాటు విజయవాడలోని వివిధ ప్రాంతాల భక్తులు సారె సమర్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: పట్టణంలో విద్యుత్‌లైన్ల మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎ.సత్యనారాయణ తెలిపారు. పండ్ల మార్కెట్ సెంటర్, వెంకటేశ్వరస్వామి కోవెల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పాల కేంద్రం కేటాయింపుపై అభ్యంతరం



కిలేశపురంలో విజయ పాల డెయిరీ యాజమాన్యం తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్న సభ్యులు

కిలేశపురం(ఇబ్రహీంపట్నం): గ్రామంలో విజయ పాలకేంద్రం కేటాయింపు విధానంపై పాలశీతల కేంద్ర సభ్యులు అభ్యంతరం తెలియజేశారు. సంస్థ యాజమాన్యం రాజకీయ దురుద్దేశంతో గతంలో అవకతవకలు పాల్పడిన వ్యక్తికే తిరిగి కట్టబెట్టే ప్రయత్నాలపై సోమవారం సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. సమర్థులైన వారికే పాలకేంద్రం అప్పగించాలని డిమాండ్ చేశారు. గతంలో పాల సేకరణలో అవకతవకలకు పాల్పడిన వ్యక్తిని సభ్యుల తీర్మానంతో యాజమాన్యం తొలగించి నూతన అధ్యక్షుడు జ్యోతిరాజుకు ఇటీవల కాలంలో బాధ్యతలు అపగించారని తెలిపారు. జ్యోతిరాజును తొలగించి గతంలో సంస్థకు నష్టాలు తెచ్చిన వ్యక్తికి కట్టబెట్టే ప్రయత్నం విరమించాలని కోరారు.

యథేచ్ఛగా కోళ్ల వ్యర్థాల తరలింపు

ఆగిరిపల్లి: మండలంలో ఇష్టానుసారంగా చేపల చెరువుల కోసం నిషేధిత కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. మండల కేంద్రమైన ఆగిరిపల్లి, చుట్టుపక్కల గ్రామాల్లో ప్రతిరోజూ చికెన్ దుకాణాల వద్ద నుంచి కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నారు. ఆ వ్యర్థాలు తీసే సమయంలో చుట్టుపక్కల భరించలేని దుర్గంధం వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి కోళ్ల వ్యర్థాలను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు



సీహెచ్ హరిణి



పి.తేజశ్వని



షేక్ ముషీరా

మైలవరం: స్థానిక ఎంబీఎం జెడ్పీ బాలికల హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థినులు ఒంగోలు ట్రిపుల్ ఐటీ కళాశాలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం పి.లక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన సీహెచ్ హరిణి 576 మార్కులు సాధించగా పి.తేజశ్విని 572, షేక్ ముషీరా 570 మార్కులు సాధించారన్నారు. ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన విద్యార్థినులను హెచ్‌ఎం శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

ధార్మిక ప్రవచనంకు విస్తృత ప్రచారం కల్పించాలి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే ఆధ్యాత్మిక ప్రవచనాలకు విస్తృత ప్రచారం కల్పించాలని ఈవో కెఎస్.రామరావు అధికారులను ఆదేశించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఈవో చాంబర్‌లో సోమవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్‌చే శ్రీకనకదుర్గ దేవి మహిమలపై అద్వితీయ ప్రవచనం ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రవచన కార్యక్రమానికి భక్తులందరూ విచ్చేసి విజయవంతం చేసేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రవచనం ఉంటుందని పేర్కొన్నారు. ప్రవచనంకు సంబంధించిన కరపత్రాలను ఇప్పటికే ముద్రించామని వాటిని భక్తులకు చేరేలా చూడాలని సూచించారు. సమీక్ష సమావేశంలో ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఏఈవో ఎస్. రమేష్‌బాబు, చంద్రశేఖర్, సుధారాణి, జంగం శ్రీనివాస్, వెంకటరెడ్డి, ఇంజినీరింగ్ విభాగానికి చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

సాగు హక్కు పత్రాలు పొందాలి

ముసునూరు: కౌలు రైతులు పంట సాగుదారు హక్కుపత్రం పొందాలని ఎంపీపీ కొండా దుర్గాభవాని సూచించారు. మండల వ్యవసాయాధికారి సంది పాము మధుమోహన్ అధ్యక్షతన సోమవారం రమణక్కపేటలో కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ కౌలు సాగు చేస్తూ ఉన్న భూమిలేని రైతులందరూ ప్రభుత్వం అందించే పథకాలు పొందాలంటే కచ్చితంగా సీసీఆర్‌సీ కార్డులు పొందాలన్నారు. అర్హులైన కౌలు రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు తదితర వివరాలతో గ్రామ రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ రామకృష్ణ, గ్రామ కార్యదర్శి ప్రసాద్, వీహెచ్ఏ సురేష్ రైతులు పాల్గొన్నారు.